క్లుప్తంగా

సాఫీగా ఈఏపీసెట్‌-24



పరీక్షకు హాజరైన విద్యార్థులు

కురబలకోట: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈఏపీసెట్‌-24 శనివారం నుంచి ప్రారంభమైంది. మండలంలో అంగళ్లలోని మిట్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో తొలి రోజు 218 మందికి 205 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌ పరీక్షల్లో పాల్గొన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతున్న ఈ పరీక్షలో ఎలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా సాగుతోందని నిర్వాహకులు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ జి. సుబ్రమణ్యం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డీజిల్‌ మెకానిక్, వెల్డర్‌ ట్రేడ్లలో ప్రవేశం పొందడానికి జూన్‌ 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

నేడు ముత్యాలమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లె పంచాయతీ సబ్‌ స్టేషన్‌ వద్ద వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం తిరునాల వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ముత్యాలమ్మ ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ప్రత్యేక అలంకరణ చేసి పోతురాజు విన్యాసాలతో గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. తిరునాలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

నల్లగంగమ్మతల్లి దీవెనలను పొందండి

కలకడ : మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని సంబేపల్లె మండలం సమీపంలో వెలసిన శ్రీదేవరాయి నల్లగంగమ్మతల్లి దేవస్థానం పరిధిలో 23వ తేదీ పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు కలకడ మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఆటోలో మైక్‌ ఏర్పాటు చేసి నల్లగంగమ్మతల్లి దీవెనలను పొందాలని కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. గురువారం రాత్రికి చాందినీ బండ్ల ప్రదక్షణ, ఏటా బోనం సమర్పణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చిన్నారికి రక్తదానం



రక్తదానం చేస్తున్న సేవా ఫౌండేషన్‌ సభ్యులు

పెద్దతిప్పసముద్రం: బెంగళూరులోని మణిపాల్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ చిన్నారికి రక్తం అవసరమైంది. సామాజిక మాధ్యమాల ద్వారా విషయం తెలుసుకున్న మండలంలోని యంగ్‌ ఇండియా సేవా ఫౌండేషన్‌ అధ్యక్షుడు రాజశేఖర్‌తో పాటు సభ్యులు గిరిధర్, అష్రఫ్, శ్రీనివాసులు, రెడ్డెప్పలు శనివారం ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. రక్తదానం చేసిన సేవా ఫౌండేషన్‌ సభ్యులను ఆసుపత్రి సిబ్బంది అభినందించారు.

వైఎస్సార్‌ సీపీ నాయకుడి మృతికి సంతాపం

కురబలకోట: మండలంలోని ఎర్రబల్లె గ్రామం తూగువారిపల్లెకు చెందిన వైఎస్సార్‌ సీపీ నాయకుడు రామతాతగారి వేమారెడ్డి (67) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఇతని కుమారుడు రవీంద్రరెడ్డి ఎర్రబల్లె గ్రామ ఎంపీటీసీగా ఉన్నారు. ఆదివారం ఉదయం స్వగ్రామం తూగువారిపల్లెలో వేమారెడ్డి అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డితో పాటు జెడ్పీటీసీ దంపతులు బైసాని జ్యోతి చంద్రశేఖర్‌ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, సర్పంచ్‌ నాగరత్న, స్థానిక నాయకులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా వాసవీ జయంత్యుత్సవాలు



మదనపల్లె సిటీ: గంగను తీసుకువస్తున్న ఆర్యవైశ్య మహిళలు



వాల్మీకిపురం: గంగాజలాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఆర్యవైశ్యులు




మదనపల్లె సిటీ: ప్రత్యేక అలంకరణలో వాసవీమాత



రామసముద్రం: అమ్మవారి ఆలయంలో హోమం చేస్తున్న దృశ్యం



పీలేరు రూరల్ : కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమం



పీలేరు రూరల్ : వాసవీమాతకు ప్రత్యేక అలంకరణ

మదనపల్లె సిటీ: స్థానిక వాసవీ భవన్‌ వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వస్తివాచనం, కలశస్థాపన, నవగ్రహ పూజ, అమ్మవారికి పంచామృతాభిషేకం, మృత్యుంజయ హోమం, వాసవీమాత మూలమంత్రహోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి, హోమాలు నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మహిళలు,కన్యకలు, దంపతులచే గంగను తీసుకువచ్చారు. దీంతో అమ్మవారికి అభిషేకాలు, పాలాభిషేకం చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణం పురవీధుల్లో బైక్‌ ర్యాలీ నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విద్యుత్, పూలతో అలకరించి పుష్పపల్లకిపై పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, కార్యదర్శి దేవతా సతీష్, ఉపాధ్యక్షులు గిరిధర్, ప్రవీణ్,కృష్ణారావు, వాసవీ మహిళా సంఘం, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం: బజారువీధిలో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నరసింహులుగుప్తా , మహిళా సంఘం ప్రెసిడెంట్‌ డి.సుబ్బులక్ష్మీ, యువజన సంఘం అధ్యక్షులు జయకుమార్, గబ్బూరి సుదర్శన్‌ బాబు, సెక్రటరీ శ్రీనివాసులుశెట్టి, శ్రీనివాస జ్యూలరీ గబ్బూరి బద్రినాథ్‌తో పాటు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, అలంకారాలు చేశారు. అలాగే వేదపండితులచే గణపతిహోమం, నవగ్రహ హోమం, వాసవి మాత మాలమంత్రహోమం, మృత్యుంజయహోం, పూర్ణాహుతి, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. అధిక సంఖ్యలో భక్తులి తరలివచ్చారు. మధ్యాహ్నం ఆర్యవైశ్య సంఘం వారిచే అన్నదానం నిర్వహించారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : స్థానిక నెహ్రూబజార్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పుష్పపల్లకీలో అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, వాసవి కపుల్స్‌ క్లబ్, వాసవి క్లబ్‌ గ్రేటర్స్‌ నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలను ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమం, నవగ్రహ హోమం, వాసవి మాత మూలమంత్ర హోమం, పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, 102 గోత్రాలను అనుసరిస్తూ 102 రకాల తీపి పదార్థములతో అమ్మవారికి నైవేద్యం నిర్వహించారు. అలాగే కోనేటివీధిలోని శివాలయం నుంచి కన్యకలచే గంగను తీసుకొచ్చి, ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సతీష్, ఆర్యవైశ్య సంఘం నాయకులు నవీన్, సురేష్, రెడ్డెప్ప, సుబ్రహ్మణ్యం, అయ్యప్ప, అప్పల, హరి, మోహన, శశిధర్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..వాసవీమాత జయంత్యుత్సవం

పెద్దతిప్పసముద్రం: ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవాలు శనివారం నేత్రపర్వంగా జరిగాయి. మండలంలోని కందుకూరు, పీటీఎం గ్రామాల్లో వాసవీ జయంతి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఏకరూప వస్త్రధారణతో మహిళలు కలశాలు, పూర్ణకుంభాలను తలపై ధరించి ఊరేగింపుగా వెళ్ళి ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారిని గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు.



వాల్మీకిపురం: విశేష అలంకరణలో వాసవీమాత



పెద్దతిప్పసముద్రం: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సింహవాహనంపై వెంకన్న వైభవం



సింహవాహనంపై స్వామివారు

మదనపల్లె సిటీ: ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం సింహవాహనంపై కొలువై విహరిస్తూ భక్తులకు అనుగ్రహించారు. దిగువకమ్మపల్లె ఉభయదారులుగా స్వామివారి సింహవాహన సేవ ప్రారంభమైంది. అలాగే నెహ్రూబజార్, త్యాగరాజవీధి, గుండ్లూరివీధి, రాఘవేంద్రరావువీధి, దేవళంవీధికి చెందిన ఉభయదారులు స్వామివారి హనుమంత వాహనం ప్రారంభించారు. వాహనం ముందు భక్తజన బృందాల చెక్కభజనలు, కోటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు పలికి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్‌ బింగి పాండు తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్‌ సనా అయేషా

వాల్మీకిపురం: క్షయ వ్యాధి లేని సమాజ లక్ష్యసాధన కోసం వయోజన బీసీజీ టీకాను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి సనా అయేషా అన్నారు. శనివారం మండలంలోని మూరేవాండ్లపల్లిలో 104 సేవలకు హాజరైన ప్రజలకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీజీ టీకాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌ ఎడ్యుకేటర్‌ మహమ్మద్‌ రఫీ, వైద్య సిబ్బంది రెడ్డెమ్మ, వనిత పాల్గొన్నారు.

కాలువలపై నిర్మాణాలు తొలగించాలి



తాళ్లవారివీధిలో స్థానికులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : పట్టణంలో మురికినీటి కాలువలపై అక్రమంగా జరిపిన నిర్మాణాలను తొలగించి మురుగు, వర్షపునీరు సాఫీగా వెళ్లేవిధంగా మున్సిపల్‌ అధికారులు చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ సీపీఐ ఇన్‌చార్జ్‌ టి.కృష్ణప్ప, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్‌ చేశారు. శనివారం శ్రీకృష్ణ రెసిడెన్సీ ఎదురుగా తాళ్లవారివీధి వద్ద గత పదిరోజులుగా మురుగునీటి కాలువ మూసుకుపోయి, మురికినీరు మొత్తం వీధిలో నిల్వ ఉండటంపై స్థానికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. పదిరోజులుగా తాళ్లవారి వీధిలోకి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నా మురికినీటిని తొలగించడంలో మున్సిపల్‌ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. పట్టణంలో చిన్నపాటి వర్షం కురిసినా ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయన్నారు. శానిటేషన్‌ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతోనే తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, శాశ్వత పరిష్కారం దిశగా అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఆదాయం పెంచి సంస్థ అభివృద్ధికి సహకరించాలి



కండక్టర్‌ అబ్రహాంకు నగదు బహుమతి అందజేస్తున్న డీఎం

మదనపల్లె సిటీ: ఆదాయం పెంచి ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆర్టీసీ–1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక డిపో కార్యాలయంలో మదనపల్లె–బీ.కొత్తకోట రూటులోని డ్రైవర్లు, కండక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బి.కొత్తకోట రూటులో ఆదాయం పెంచాలన్నారు. ఏప్రిల్‌ నెలలో అత్యధికంగా ఈపీకె తెచ్చిన కండక్టర్‌ బి.అబ్రహాంకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్‌ రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఉపశమనం

కలకడ : వర్షంతో కలకడ మండలం చల్లబడింది. ఎండలు మండుతున్న తరుణంలో అధిక వేడికి తాలలేక పోతున్న ప్రజలకు శనివారం కురిసిన మోస్తరు వర్షం ఉపశమనం కల్పించింది. శనివారం సాయంత్రం 6గంటల నుంచి 8గంటల వరకు కురిసిన వర్షానికి నీటి నిల్వలు నిలబడ్డాయి. వీధులలో సైతం అధికంగా నీరు ప్రవహించడంతో కలకడలో కొన్ని కుటుంబాలలోకి వర్షపు నీరు చేరింది. ఎక్కడ ఎలాంటి ప్రమాదాలు జరగలేదు.

నేటి నుంచి నల్లవీర గంగమ్మ జాతర



జాతరకు ముస్తాబైన ఆలయం

వాల్మీకిపురం: వాల్మీకిపురం గ్రామ దేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతరను ఈ నెల 19 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రమణా రెడ్డి తెలిపారు. ఆదివారం, గురువారం గంగరాళ్లకు నీళ్లపోయుట, శుక్రవారం శేషపోయుట, అఖండ జ్యోతి వెలిగించుట, కలశస్థాపన, ధ్వజారోహణ, ఉలవదేవర అమ్మవారి జాగారం, శనివారం పాలపొంగు దేవర జాగారం, 26న గంగరాళ్లకు నీళ్ల పోయుట, దీలుబోణాలు సమర్పణ, 27న సోమవారం దోపు తిరునాల నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు కార్యక్రమాల్లో పాల్గొని, జాతరలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

వికసించిన మే పుష్పం



వికసించిన మే పుష్పం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం రామారావుకాలనీలోని ప్రముఖ నవలా రచయిత టీఎస్‌ఏ క్రిష్ణమూర్తి ఇంటి ఆవరణంలో మే పుష్పం వికసించింది. మే పుష్పం చూపరులకు కనువిందు చేస్తోంది. ఏడాదికి ఓ సారి కనిపించే పువ్వులను స్థానికులు తిలకిస్తున్నారు.

శ్రీ కాలభైరవుడికి విశేష పూజలు

రాయచోటి టౌన్‌ : రాయచోటి రూరల్‌ పరిధిలోని యండపల్లె సమీపంలో ఉన్న పెద్ద గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం అనంతరం స్వామి వారికి పట్టు వస్త్రాలు, రంగు రంగుల పూలతో అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

22న హోమాలు

శ్రీ కాలభైరవుడి తిరునాల సందర్భంగా ఈ నెల 22న హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ హోమంలో పాల్గొనే వారు తమ నామ గోత్రాలు పంపాలని కోరారు. అలాగే ఆ రోజు స్వామి వారిని దర్శనం చేసుకొని కరుణకటాక్షాలను పొందాలని కోరారు.

వైఎస్‌ జగన్‌ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్మోహన్‌ రెడ్డి మరోమారు అధికారంలోకి రావడం ఖాయమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి విషయంలో దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా సీఎం జగన్‌ చేసి చూపించారన్నారు. మహిళలు, వృద్ధులు, యువత జగన్‌ను నమ్మి ఓటు వేశారని, వైఎస్సార్‌సీపీ రెండోసారి విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలోని హామీలను అమలు చేసి సీఎం జగన్‌ ప్రజల విశ్వాసాన్ని పొందారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశిష్టమైన పూజలు, వేకువజామునే పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : మండలంలో యథేచ్ఛగా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివలు డిమాండ్‌ చేశారు. శనివారం మండలంలోని వేంపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లె చెరువులో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పరిశీలనలో పెద్ద ఇసుక డంప్‌లను గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పగలు, రాత్రి తేడా లేకుండా చెరువులో జేసీబీలతో పెద్ద పెద్ద గుంతలు తవ్వి ఇసుకను తోడేస్తున్నా రెవెన్యూ అధికారులకు సమాచారం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇసుక అక్రమ రవాణాపై స్థానికులు పలుమార్లు తహసీల్దార్‌కు ఫోన్‌ చేసి చెప్పినా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు తక్షణం ఇసుక అక్రమరవాణాపై చర్యలు తీసుకుని, భూగర్భజలాల పెంపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు మురళి తదితరులు పాల్గొన్నారు.

సేవా తత్పరుడ్ని కోల్పోవడం బాధాకరం



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: సేవా తత్పరుడు కలికిరి గ్రామ పంచాయతీ సర్పంచ్‌ ఆర్‌.ప్రతాప్‌కుమార్‌రెడ్డి అకాల మరణం ప్రజలకు తీరని లోటని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలికిరి సర్పంచ్‌ మృతి సమాచారంతో శనివారం ఉదయం కలికిరి రెడ్డివారిపల్లికి చేరుకున్న ఎమ్మెల్యే సర్పంచ్‌ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి నాయకున్ని కోల్పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సోదరుడు చింతల శివానందరెడ్డి, కలికిరి, వాల్మీకిపురం మండలాల పార్టీ కన్వీనర్‌లు రమేష్‌కుమార్‌రెడ్డి, నీళ్ల భాస్కర్, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, అరుణబాబురెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శివాజీ, ఎస్టీడి హరి తదితరులు నివాళులు అర్పించారు. కలికిరి పంచాయతీతో పాటు మండలంలోని పలుగ్రామాల నుంచి విచ్చేసిన ప్రజలు ఆయనకు నివాళలు అర్పించారు.